సిఐటియు మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కరపత్రాలు పంపిణీ చేస్తున్న నేతలు

ఈ నెల 31వ తేదీ నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత సిఐటియు మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు పిలుపునిచ్చారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో భవన నిర్మాణ కార్మికులతో సమావేశమై కరపత్రాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును కొనసాగించాలని, కార్మికుల చట్టంలోని పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జై భీమ్ యూనియన్ ప్రెసిడెంట్ బి.రమణ, ఎన్.వెంకటరత్నం, పి.నాగేశ్వరరావు ఎం.రమేష్, నవీన్, శేఖర్ పాల్గొన్నారు.

కొల్లేరు రైతులకు న్యాయం..
చింతలపూడి ఎత్తిపోతల పూర్తి

ఉంగుటూరు నియోజకవర్గానికి వరాలు
బంగారు కుటుంబాల చేయూతకు దిశానిర్దేశం
నల్లమాడు సభలో సిఎం చంద్రబాబు
ఐదు గంటలకుపైగా సాగిన సిఎం పర్యటన
టిడిపి శ్రేణుల ప్రత్యేక సమావేశంలో పలు సూచనలు


ప్రజావేదికలో మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, ఉంగుటూరు

జిల్లాలోని కొల్లేరు సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేస్తామని, త్వరలోనే చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి నీటిఎద్దడి సమస్యను పరిష్కరిస్తామని సిఎం చంద్రబాబు తెలిపారు. డిసెంబర్ నెల పింఛన్ల పంపిణీలో భాగంగా సిఎం సోమవారం ఉంగుటూరు మండలం గోపినాథపట్నం, నల్లమాడు గ్రామాల్లో పర్యటించారు. ఉదయం 11.40 గంటలకు హెలీకాప్టర్‌లో నల్లమాడు గ్రామంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు సిఎం చేరుకున్నారు. అక్కడ నుంచి గోపినాథపట్నం వెళ్లి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మికి రూ.పది వేలు పింఛన్ అందించారు. ఆ కుటుంబ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడి నుంచి నల్లమాడులో ఏర్పాటు చేసిన సభా ప్రాంగణానికి చేరుకుని అక్కడ వ్యవసాయ, ఉద్యాన, మహిళా సాధికారిత, కోళ్ల పెంపకం వంటి వాటిపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు. ఎకరా పొలంలో కొంత వరిసాగు, కొంత చేపల సాగు చేస్తూ ఎకరాకు రూ.రెండు లక్షలకుపైగా సంపాదిస్తున్న రైతును సిఎం అభినందించారు. పదెకరాల వరకూ ఈ విధంగా సాగుచేయడంపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఉద్యాన, వ్యవసాయ అధికారులకు సైతం పలు సూచనలు చేశారు. అక్కడకు వచ్చిన మహిళ తనకు ఇల్లు లేదని చెప్పగా ఇల్లు కట్టించాలని కలెక్టర్ వెట్రిసెల్విని ఆదేశించారు. అనంతరం పేదల సేవలో ప్రజావేదిక సభలోకి సిఎం చేరుకున్నారు. ముందుగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో ఇస్తున్న పింఛన్లు, సంక్షేమ పథకాల లబ్ధిదారుల వివరాలతోపాటు, వ్యవసాయం, ఉద్యాన పంటలతోపాటు జిల్లాలోని అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. సిఎం పర్యటనలో మంత్రి నాదెండ్ల మనోహర్, కొలుసు పార్థసారథి, ఎంఎల్‌ఎలు చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, బడేటి చంటి, చిర్రి బాలరాజు, కామినేని శ్రీనివాస్, మద్దిపాటి వెంకటరాజు మాజీ ఎంఎల్‌ఎ ఘంటా మురళి, ఆర్‌టిసి రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఐజి అశోక్‌కుమార్, ఎస్‌పి కె.శివప్రతాప్ కిషోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వివరించిన ఎంఎల్‌ఎ, ఎంపి, ఆప్కాబ్ చైర్మన్

ఉంగుటూరు ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు వివరించి.. సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలను వివరించారు. నియోజకవర్గంలో పలు సమస్యలు ఉన్నాయని, నిధులు మంజూరు చేయాలని కోరారు. నిడమర్రు మండలం పెదనిండ్రకొలనులో పిహెచ్‌సిని సిహెచ్‌సిగా అప్‌గ్రేడ్ చేసి 30 పడకలు ఏర్పాటు చేయాలన్నారు. నల్లజర్ల-లక్ష్మీపురం రోడ్డు తారు రోడ్డుగా అభివృద్ధి చేయాలని కోరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే నుంచి నేషనల్ హైవేకు, రెండు స్టేట్ రహదారులకు కనెక్టివిటీ ఇవ్వడంతోపాటు కలపాలని తెలిపారు. భీమడోలు గురుకుల పాఠశాల దెబ్బతిందని, పునఃనిర్మించాలని, నారాయణపురంలో జూనియర్ కాలేజీ శిథిలావస్థకు చేరిందని నిర్మించాలని, ఆర్‌ఒబిల నిర్మాణం పూర్తి చేయాలని కోరారు. చెరువులకు పోలవరం కుడి కాలువ నీటిని ఎత్తిపోతల ద్వారా నింపితే భూగర్భ జలాలు పెరిగి తాజానీటి వల్ల మత్స్య సంపద పెరుగుతుందని సిఎంకు వివరించారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ అంతా కలిసికట్టుగా నియోజకవర్గ అభివృద్ధికి పని చేస్తున్నామన్నారు. ఆయిల్‌పామ్ తోటపై నుంచి వెళ్లిన కరెంటు లైన్లను మార్చడానికి 20 శాతం ఖర్చు వసూలు చేస్తున్నారని, అది రైతులకు భారంగా మారిందని, రెండు, మూడు శాతం మాత్రమే వసూలు చేయాలని కోరారు. గొల్లగూడెం గ్రామాభివృద్ధికి రూ.రెండు కోట్లు ఇవ్వాలని కోరారు. ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ మాట్లాడుతూ పొగాకు, మామిడి, వరిరైతులంతా సంతోషంగా ఉన్నారన్నారు. కొల్లేరుకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చామన్నారు. సుప్రీంకోర్టు తీర్పు కూడా పాజిటివ్‌గా వస్తుందన్నారు. చింతలపూడి ఎత్తిపోతలను పూర్తి చేయాలని, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డును హైవేగా మార్చి అభివృద్ధి చేయాలని, ఏలూరు నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ఏర్పాటు చేయాలని కోరారు. రైల్వే ఓవర్‌బ్రిడ్జిల నిర్మాణం వచ్చే మార్చిలో ప్రారంభిస్తామన్నారు. నాయకులు తెలిపిన సమస్యలను పరిష్కరించాలని సిఎం అధికారులను ఆదేశించారు. పోలవరం కుడికాలువ నీటితో చెరువులు నింపుదామని సిఎం అన్నారు.

చంద్రబాబుకు వరికంకుల మాలతో స్వాగతం


మాట్లాడుతున్న ఎంపి మహేష్‌కుమార్, ఎంఎల్‌ఎ ధర్మరాజు, ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు

గుడ్ల నాగలక్ష్మి కుటుంబానికి చేయూత

కిడ్నీ సమస్యతో బాధపడుతున్న గుడ్ల నాగలక్ష్మికి పింఛన్ అందించిన సిఎం కుటుంబ సమస్యలను తెలుసుకున్నారు. అప్పులు పూర్తిగా తీరుస్తామని, ఎంసిఎ చదువుతున్న కుమారునికి మంచి ఉద్యోగం, కుమార్తె వాసవి ఆపేసిన చదువును ఇంటర్, డిగ్రీ పూర్తి చేయిస్తామని, డ్రోన్ ద్వారా నెలకు రూ.25 వేల ఆదాయం వచ్చేలా చర్యలు, ఇంటి యజమానికి ఐస్ ఫ్యాక్టరీలో ఉద్యోగం కల్పిస్తామని సిఎం చెప్పారు. బంగారు కుటుంబాలు సుంకర నాగమణి కుటుంబానికి మార్గదర్శి పసులేటి రామారావు, మరో బంగారు కుటుంబం జాలాది లక్ష్మికి మార్గదర్శి మనోజ్ శంకర్‌దత్తా ఆర్థికంగా చేయూతనిచ్చి ఇల్లు కట్టడం, పిల్లల చదువులు చూస్తామని చెప్పారు. మార్గదర్శకులను సిఎం సన్మానించారు.

టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం

ఉంగుటూరు నియోజకవర్గ పర్యటనలో ప్రభుత్వ కార్యక్రమం ముగిసిన తర్వాత టిడిపి నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సిఎం సమావేశమయ్యారు. సమావేశంలో పలు అంశాలపై నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేసినట్లు తెలిసింది.

కలెక్టర్.. అడ్మినిస్ట్రేషన్ ఇలాగైతే ఎలా..

నల్లమాడు గ్రామానికి సంబంధించిన జనాభాతోపాటు ఇతర వివరాలను ఉద్యానవన శాఖ సచివాలయ ఉద్యోగి ప్రేమ్‌కుమార్ సిఎంకు వివరించారు. దీంతో అన్నింటిపైనా అవగాహన ఉందా, లేకపోతే నేను వస్తున్నని తెలుసుకుని చిలకపలుకులు పలుకుతున్నావా అని సిఎం అడిగారు. తెలుసని చెప్పడంతో అయితే ఎన్ని ఎకరాల సాగు భూమి ఉంది, ఏయే పంటలు పండిస్తున్నారు, రైతుల ఆదాయం పెంచేందుకు ఎటువంటి ప్రణాళికలు చేపట్టారో చెప్పాలని సిఎం అడిగారు. మొత్తం సాగుభూమి 1400 హెక్టార్ల వరకూ ఉందని ఉద్యోగి చెప్పగా, నాకు ఇచ్చిన దాంట్లో 400 హెక్టార్ల వరకూ ఉందంటూ కలెక్టర్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్లు గ్రామంలో ఎన్ని ఉన్నాయని, ఎన్ని కట్టాల్సి ఉందని అడగా సదరు ఉద్యోగి సమాధానం చెప్పలేకపోయారు. ఇంటర్‌నెట్ కనెక్షన్లపైనా సరైన సమాధానం చెప్పలేకపోవడంతో కలెక్టర్.. అడ్మినిస్ట్రేషన్ ఇలా ఉంటే ఎలా.. మీరు చేయాలి... ఉద్యోగులతో చేయించాలి అంటూ చురకలు అంటించారు. తాను వచ్చి రెండు నెలలు అయ్యిందని ఉద్యోగి చెప్పగా, ముందున్నవారు ప్రణాళికలు రూపొందించలేదా అంటూ ప్రశ్నించడంతో చేరారని ఉద్యోగి సమాధానమిచ్చారు. మిగిలి ఉన్న సిసి రోడ్లు, డ్రెయినేజీ పనులు, మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. సోలార్ ఏర్పాటు చేయాలని, వచ్చే బడ్జెట్‌లోపు ఇవన్నీ జరగాలన్నారు. సంక్షేమం, అభివృద్ధి జరగాలని, అందరికీ శిక్షణ ఇవ్వాల్సి ఉందని సిఎం వ్యాఖ్యానించారు. గ్రామసభలు మొక్కుబడిగా కాకుండా, ఫలితాలు వచ్చేలా ఉండాలన్నారు. సభలో మైక్ పని చేయకపోవడం అందరిలోనూ తీవ్ర అసహనం రేపింది. కలెక్టర్ సైతం అక్కడి అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

చిరుజల్లులతో రైతుల్లో ఆందోళన

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో పనలపై ఉన్న వరి పైరు

దిత్వా తుపాన్ ప్రభావంతో సోమవారం కూడా మండలంలో చిరుజల్లులు పడటంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. మొన్న మొంథా తుపాన్ వల్ల అపార నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం దిత్వా తుపాన్‌తో తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. చిరుజల్లుల కారణంగా ధాన్యం రోడ్లపై, ఇళ్ల ముందు, పొలం గట్లపై పరదాలు కప్పి ఉన్నాయి. యంత్రాల ద్వారా కోసిన ధాన్యం 25 నుంచి 30 శాతం వరకు తేమ ఉంటుంది. 30 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయడానికి ఇష్టపడటం లేదు. గుట్టలుగా పోస్తే ధాన్యం రంగు మారుతుందంటున్నారు. ఒకపక్క కాటాలు వేసిన ధాన్యపు బస్తాలు, మరోపక్క రోడ్ల పక్కన ఆరబెట్టిన ధాన్యపు రాశులు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో వరి కోతలు కోయగా, తుపాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు హడావిడిగా కుప్పలు వేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వరి పంట వివిధ దశల్లో ఉంది. ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు పెరగడంతో దిగుబడులు గిట్టుబాటయ్యే పరిస్థితి కన్పించడం లేదని రైతులు వాపోతున్నారు.

కావ్య ఆత్మహత్యపై సమగ్ర దర్యాప్తు చేయాలి

పిజిఆర్‌ఎస్‌లో దళిత, ప్రజాసంఘాల నేతల వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వినతిపత్రం అందిస్తున్న దళిత, ప్రజాసంఘాల నేతలు

జంగారెడ్డిగూడెంలోని అంబేద్కర్ గురుకుల పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పొడపాటి కావ్య ఆత్మహత్యపై ప్రత్యేక దర్యాప్తు చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని దళిత, ప్రజాసంఘాల నాయకులు పిజిఆర్‌ఎస్‌లో వినతి పత్రం అందజేశారు. కలెక్టరేట్‌లో సోమవారం వినతి అందించిన సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ పొడపాటి కావ్య మరణానికి కారణం ఆత్మహత్య కాదని, ఉద్దేశపూర్వకంగా కావ్యను మానసికంగా, శారీరకంగా పాఠశాలలో టీచర్ పోచమ్మ, ఇతర ఉపాధ్యాయులు మానసికంగా వేధించారని, శారీరకంగానూ కొట్టి హింసించారని ప్రజాసంఘాల పరిశీలనలో తెలిసిందన్నారు. దీనిపై ప్రశ్నించిన ప్రజాసంఘాల నాయకులు 25 మందిపై జంగారెడ్డిగూడెం సిఐ, తహశీల్దార్ కక్షపూరితంగా తప్పుడు కేసులు పెట్టారని, వీటన్నింటిపై సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని, మృతి చెందిన కావ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) ప్రజా పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కలింపూడి సుందర్రావు, పిడిఎస్‌యు జిల్లా కార్యదర్శి కాకి నాని, దళిత నాయకులు కర్ని కోటి దిలీప్, సురేష్ తదితర దళిత, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

కొత్తూరులో కౌలురైతుల నిరసన

ప్రజాశక్తి - పెదపాడు

నిరసన తెలుపుతున్న రైతు సంఘం నేతలు, కౌలురైతులు

కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఇవ్వాలని, కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంట సాగుకు అపరాల విత్తనాలు సబ్సిడీపై అందించాలని, మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతాంగానికి పరిహారం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి రైతుసంఘం, ఎపి కౌలురైతుల సంఘం ఆధ్వర్యంలో కొత్తూరులో కౌలు రైతులు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కౌలు రైతులను ఆదుకోవాలని నినదించారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ వ్యవసాయంలో ఎంతో కష్టపడుతున్న, నష్టపోతున్న కౌలురైతులకు పెట్టుబడి సాయం అందించకపోవడం అన్యాయమని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ వాగ్దానం మేరకు కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కృష్ణా డెల్టా పరిధిలో రెండో పంట సాగుకు అపరాల విత్తనాలు సబ్సిడీపై కొద్దిమంది రైతులకు మాత్రం అందించి చేతులు దులుపుకోవడం తగదన్నారు. రైతులందరికీ మినుములు, పెసలు విత్తనాల సబ్సిడీ అందించాలని కోరారు. మొంథా తుపాన్ వల్ల నష్టపోయిన రైతులకు, కౌలురైతులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలురైతుల సంఘం మండల నాయకులు పల్లపోతు రెడ్డియ్య, ఆవాల మోహన్‌రావు, పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు.

పేదల సాగులోని భూములకు పట్టాలివ్వాలి

సిపిఎం ఆధ్వర్యాన తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి


తహశీల్దార్ ప్రసాద్‌కు వినతి అందిస్తున్న సిపిఎం నాయకులు

పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద పేదల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు పిఎన్‌వి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఈదులగూడెంలో 65 కుటుంబాలకు చెందిన పేద దళితులు సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములకు వెంటనే పట్టాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సత్తు కోటేశ్వరరావు, షేక్ జహాంగీర్‌భాషా, ముత్యాల నరేష్, స్టాలిన్, రవికుమార్, రాణి, విఘ్నేశ్వరి, సుబ్బయ్య, పలువురు పేద దళితులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో యంత్ర పరికరాలకు రూ .5 లక్షల విరాళం

ప్రజాశక్తి - ఉంగుటూరు

నాగేంద్రను అభినందిస్తున్న సిఎం చంద్రబాబు

టిడిపి సీనియర్ నాయకుడు కీర్తిశేషులు బూరుగుపల్లి వీర వెంకట ఆంజనేయులు జ్ఞాపకార్థం ఆయన కుటుంబసభ్యులు రూ.ఐదు లక్షల విరాళాన్ని చెక్కు రూపంలో సిఎం చంద్రబాబుకు ఆదివారం అందించారు. ఉంగుటూరు నియోజకవర్గంలో ఉన్న అన్ని పిహెచ్‌సిలకు ఐసియు మానిటర్లు (ఇసిజి మెషిన్), ఐసియు బెడ్స్ డొనేషన్ చేయడం కోసం రూ.ఐదు లక్షల చెక్కును సిఎంకు ఇచ్చినట్లు కుమారుడు బూరుగుపల్లి నాగేంద్ర తెలిపారు.

3న అగ్రిగోల్డ్ బాధితుల దీక్షా యాత్ర

ప్రజాశక్తి - కలిదిండి

ఈ నెల మూడో తేదీన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నా చౌక్ వరకు జరిగే అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన దీక్షా యాత్రకు బాధితులు తరలిరావాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఎజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కైకలూరు నియోజకవర్గ అధ్యక్షులు చక్కా జగన్మోహన్‌రావు కోరారు. అగ్రిగోల్డ్ బాధితులందరూ కదలిరావాలని కోరుతూ బాధితులను కలిసి కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వాలు మారినా బాధితులకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి బాధితులందరూ ఒక్కటై దీక్షా యాత్రలో పాల్గొనాలన్నారు. అసోసియేషన్ నాయకులు అలజింగి వెంక రాంబాబు, పచ్చిగొళ్ల లలితా ప్రసాద్ పాల్గొన్నారు.

కుష్టు నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్

ప్రజాశక్తి - ముసునూరు

కుష్టు వ్యాధి నిర్మూలన ప్రభుత్వ లక్ష్యమని స్టేట్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ దేవసాగర్ అన్నారు. మండల పరిధిలోని కాట్రేనిపాడు గ్రామంలో కుష్టు వ్యాధి సర్వే, గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు భవానితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆశాలకు, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి లక్ష్మీనారాయణ, వైద్య సిబ్బంది మురళీమోహన్, హెల్త్ అసిస్టెంట్ దుర్గారావు, ఆశాలు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సస్పెన్షన్ అన్యాయం

బంక్‌లో స్కామ్‌పై సమగ్ర దర్యాప్తు చేయాలి
సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్
8వ రోజు కొనసాగిన నిరాహారదీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మాట్లాడుతున్న సిఐటియు జిల్లా నేత డిఎన్‌విడి.ప్రసాద్

ఏలూరు ఆర్‌టిసి పెట్రోల్ బంక్ స్కామ్ విషయంలో నిష్పక్షపాత దర్యాప్తు నిర్వహించకుండా, స్కామ్‌కు పాల్పడిన బాలరాజుతోపాటు స్కామ్‌తో సంబంధం లేని మరో ముగ్గురు ఉద్యోగులపై సస్పెన్షన్ వేటు వేయడం అన్యాయమని సిఐటియు జిల్లా కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. సోమవారం ఏలూరులోని ఆర్‌టిసి గ్యారేజీ వద్ద జరుగుతున్న రిలే నిరాహార దీక్ష ఎనిమిదో రోజు శిబిరాన్ని ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2021 నుండి సరైన ఆడిట్ నిర్వహించకుండా 2025లో రూ.82 లక్షలు స్కామ్ జరిగిందని ఆర్‌టిసి యాజమాన్యం పేర్కొనడం విస్మయానికి గురిచేసిందన్నారు. అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని ప్రసాద్ హెచ్చరించారు. ఉద్యమానికి వివిధ రాజకీయ పార్టీలు, కార్మిక సంఘాలు సంఘీభావం తెలిపాయి. సోమవారం శిబిరాన్ని సందర్శించిన ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి శ్రీనివాస్ డాంగే, బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఆర్‌టిసి పెట్రోల్ బంకులో రూ.82 లక్షలు అవినీతి జరిగితే, దానిపై 13 మంది అధికారులు, ఉద్యోగులను విచారించారని తెలిపారు. ఆర్‌టిసి ఉన్నతాధికారుల విచారణలో ఆర్‌టిసి ఉద్యోగి, బంకు నిర్వాహకుడు బాలరాజు అవినీతికి పాల్పడినట్లు, బాలరాజుకు ఔట్‌సోర్సింగ్ సిబ్బంది మరియమ్మ, పవన్ సహకరించినట్లు తేలినట్లు తెలుస్తుందన్నారు. ఆర్‌టిసి అధికారులు బాలరాజు, మరియమ్మపై కేసు పెట్టి, పవన్‌పై పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. ఆర్‌టిసి అధికారులు ఇచ్చిన ఫిర్యాదుపై ఇంతవరకు ఎఫ్‌ఐఆర్ నమోదు కాలేదని, దీనిపై ఆర్‌టిసి అధికారులు చలనం లేనట్లు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పవన్‌పైనా కేసు పెట్టి అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. అసలు దోషుల నిర్ధారణయ్యే వరకు స్కామ్‌తో సంబంధం లేని ముగ్గురు ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఉత్తర్వులను రద్దు చేయాలని ఆర్‌టిసి ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. ఎనిమిదో రోజు దీక్షలో బికె.సుభాని, కె.శ్రీనివాస్, పికెబి.రాజు, సిహెచ్‌ఎస్.నారాయణ, బిసిహెచ్.బాబు, పి.సర్వేశ్వరరావు పాల్గొన్నారు. ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ఏలూరు డిపో గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాస్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ బి.వినూత్న

ప్రజాశక్తి - నూజివీడు టౌన్


సిబ్బందితో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ బి.వినూత్న

మండలంలోని పోతురెడ్డిపల్లి, అన్నవరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న ఆకస్మిక తనిఖీ చేసి ధాన్యం కొనుగోలు కేంద్రాల పనితీరుపై రైతులను, పిపిసి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ రైతులందరూ ధాన్యం కొనుగోలు కేంద్రాలు వినియోగించుకోవాలని చెప్పారు. దళారుల వ్యవస్థ లేకుండా రైతులు నేరుగా తమ ధాన్యం కొనుగోలు కేంద్రంలో అమ్ముకోవడం వల్ల మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. రైతులకు అవసరమయ్యే గోనె సంచులు, టార్పాలిన్లు ప్రతి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని, కావాల్సిన ౖతులు వాటిని వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం పోతురెడ్డిపల్లి గ్రామంలో టార్పాలిన్లతో కప్పి ఉన్న ధాన్యం రాశులను పరిశీలించి వర్షానికి ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బద్రు, మండల వ్యవసాయ అధికారి పి.చెన్నారావు, రైతులు, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన అవసరం

జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అవగాహనా ర్యాలీలో డిఇఒ వెంకటలక్ష్మమ్మ

విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. సమాచార హక్కు చట్టం-2005 ప్రారంభమై 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆమె ఆధ్వర్యంలో విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటలక్ష్మమ్మ మాట్లాడుతూ ప్రజల్లో సమాచార హక్కు చట్టం - 2005పై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచారం హక్కు చట్టం ద్వారా కావాల్సిన సమాచారాన్ని ప్రజలు పొందవచ్చని తెలిపారు. జిల్లాలోని అన్ని మండల విద్యా శాఖా కార్యాలయాల్లో, పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు.

డిప్యూటీ ఎంపిడిఒగా దుర్గారావు

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

ఆగిరిపల్లి మండల గ్రామ వార్డు సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒగా పి.దుర్గారావు సోమవారం బాధ్యతలు చేపట్టారు. నూజివీడు డివిజిఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై ఆగిరిపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ వార్డు సచివాలయాల సేవలను ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిప్యూటీ ఎంపిడిఒగా ఎల్.నాగలక్ష్మి

ప్రజాశక్తి - టి.నరసాపురం

గ్రామ వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపిడిఒగా ఎల్.నాగలక్ష్మి సోమవారం బాధ్యతలు చేపట్టారు. మండలంలోని బండివారిగూడెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న ఆమె డిప్యూటీ ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి పొందారు. గతంలో పలు పంచాయతీల్లో కార్యదర్శిగా పని చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆమెను ఎంపిడిఒ జి.మణికుమారితో పాటు సిబ్బంది అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాగలక్ష్మి మాట్లాడుతూ సచివాలయాల అభివృద్ధితో పాటు సచివాలయాల ద్వారా ప్రజలకు అందించే సేవలు పూర్తిస్థాయిలో అందేలా చూస్తానని తెలిపారు. ఉద్యోగోన్నతి మరింత బాధ్యతను పెంచిందని అంకిత భావంతో పనిచేస్తానని తెలిపారు.

డిప్యూటీ ఎంపిడిఒగా వెంకట విజయభాస్కర్

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి ఎంపిడిఒ కార్యాలయంలో గ్రామ, వార్డు సచివాలయ డిప్యూటీ ఎంపిడిఒగా తాత వెంకట విజయభాస్కర్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణా జిల్లా గూడూరు మండలం గూడూరు గ్రేడ్-1 పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ ఉద్యోగోన్నతిపై ముదినేపల్లి డిప్యూటీ ఎంపిడిఒగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను సచివాలయ సిబ్బంది, పలువురు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

మంచి మనసు చాటిన సబ్ కలెక్టర్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఓ వికలాంగుడి సమస్య విన్నవించడంతో స్వయంగా సబ్ కలెక్టర్ సమావేశ మందిరం నుంచి దిగివచ్చారు. నూజివీడు పట్టణానికి చెందిన వికలాంగుడైన రామగిరి సాంబశివరావు తన పూర్వీకుల నుంచి సంక్రమించిన 169 గజాల స్థలాన్ని ఇద్దరు వ్యక్తులు కబ్జా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మీకోసం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన వికలాంగుడు సాంబశివరావు లోపలికి వచ్చేందుకు తీవ్ర ఇబ్బంది పడడంతో గమనించిన సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న తానే వస్తున్నానంటూ కబురు పంపి, వికలాంగుడు వద్దకు వచ్చి సమస్యను అడిగి తెలుసుకున్నారు. సాంబశివరావు స్థలానికి సంబంధించిన పత్రాలను పరిశీలించి, తక్షణమే సమస్యను పరిష్కరిస్తానని సబ్ కలెక్టర్ వినూత్న హామీ ఇచ్చారు. తన సమస్యను వినేందుకు తన వద్దకు వచ్చి, పరిష్కార దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చిన సబ్ కలెక్టర్ వినూత్నకు వికలాంగుడైన సాంబశివరావు కృతజ్ఞతలు తెలిపారు.

పామాయిల్ కాటాను రైతులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

పామాయిల్ రైతుల అవసరాలకు అనుగుణంగా నూతన కాటా ఏర్పాటు చేసినట్లు జంగారెడ్డిగూడెం ఏరియా నవభారత్ పామాయిల్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మక్కినవారిగూడెం సొసైటీ ఛైర్పర్సన్ ఆదంట సూర్యనారాయణ తెలిపారు. మండలంలోని బండి వారిగూడెం గ్రామంలో నవభారత్ కంపెనీ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన పామాయిల్ కాటాను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బండివారిగూడెం గ్రామంలో నూతనంగా కాటా ఏర్పాటు చేయడం వల్ల మక్కినవారిగూడెం, బండివారిగూడెం, అప్పలరాజుగూడెం పంచాయతీల్లోని రైతులకు ఉపయోగకరంగా ఉంటుందని ఆయన తెలిపారు. నూతన కాటా ఏర్పాటుతో నిర్దిష్ట సమయంలో తమ పంట ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం లభిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దాసరి రాంబాబు, నాశం కాశీ, గెడా శ్రీధర్, సాధు చిన పెంటయ్య, దాసరి నాగులు తదితరులు పాల్గొన్నారు.

కాటాను ప్రారంభిస్తున్న సూర్యనారాయణ

విజయకేతనం పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు విజయకేతనం పుస్తకాల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, పోలవరం సర్పంచి పాడుం పుష్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బొరగం శ్రీనివాసులు మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులు సాధించేందుకు ప్రభుత్వం విలువైన పుస్తకాన్ని అందిస్తున్నారని, అన్ని సబ్జెక్టులను ఒకే పుస్తకంలో సమగ్రంగా రూపొందించి ఈ 'ఆల్ ఇన్ వన్' విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అందరూ శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. సర్పంచి పాడుం పుష్ప మాట్లాడుతూ గురువుల మాటలు శ్రద్ధగా విని, ప్రతి అంశాన్ని చక్కగా నేర్చుకుని పోలవరానికి, పోలవరం గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని విద్యార్థులను ప్రోత్సహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.సత్యనారాయణ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు రూపొందించిన విజయకేతనం పుస్తకం తప్పక సమయంలో ఎక్కువ మార్కులు సాధించేందుకు ఉపయోగపడుతుందని ప్రేక్షకులకు రూపొందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి సత్యనారాయణ (చిన్ని), టిడిపి మండలాధ్యక్షులు మంగిన వెంకటరమణ (కొండ), నీటిపారుదల సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, నల్ల రాంబాబు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హౌస్ అరెస్ట్ ప్రభుత్వ దొల్లతనం

వైసిపి బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటరమణ

ప్రజాశక్తి - దెందులూరు

సిఎం చంద్రబాబు ఉంగుటూరు మండల పర్యటనలో తనను హౌస్ అరెస్ట్ చేయడం కూటమి ప్రభుత్వ దొల్లతనమని వైసిపి బిసి సెల్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నౌడు వెంకటరమణ అన్నారు. నిడమర్రు మండలం పత్తేపురంలోని తన నివాసానికి సిఐ, ఎస్ఐ, స్పెషల్ సిబ్బంది వచ్చి సిఎం పర్యటనలో ఎటువంటి ఆటంకాలు, ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా మిమ్మల్ని హౌస్ అరెస్ట్ చేస్తున్నామని, సహకరించాలని కోరారన్నారు. పోలీస్ శాఖ మీద ఉన్న గౌరవంతో పోలీస్ అధికారులకు తాను హౌస్ అరెస్ట్‌కు సహకరించానన్నారు. ఎన్నికల ముందు బిసిల ఇతర కులాలకు సంబంధించి ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రశ్నిస్తున్నందుకు అభద్రత భావంతో కూటమి ప్రభుత్వం హౌస్ అరెస్ట్ చేసిందన్నారు. రాజకీయాల్లో ఈ తరహా పాలన దారుణమన్నారు.

నేరాలు - ఘోరాలు

ఇసుక లారీలు పట్టివేత

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కొవ్వూరు సమీపంలోని ఇసుక ర్యాంపుల నుంచి తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను పట్టుకున్నట్లు ఎస్ఐ వి.క్రాంతికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... జీలుగుమిల్లి మండలంలోని దర్భగూడెం సమీపంలోని జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున వాహన తనిఖీలు చేస్తుండగా కొవ్వూరు వైపు నుంచి ప్రభుత్వ ఇసుక ర్యాంపుల నుంచి రెండు లారీల్లో ఇసుకను లోడ్ చేసుకుని తెలంగాణ రాష్ట్రానికి వెళ్తుండగా మార్గ మధ్యలో ఆపి తనిఖీ చేశారు. దీంతో సరైన పత్రాలు లేకపోవడంతో లారీలను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రజాశక్తి
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పింఛన్ల సొమ్ము సద్వినియోగం చేసుకోవాలి



కామవరపుకోటలో..

ప్రజాశక్తి - కామవరపుకోట

సామాజిక పెన్షన్ల ఘనత టిడిపిదే అని చింతలపూడి మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ, టిడిపి మండలాధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అన్నారు. కామవరపుకోట (కొత్తూరు) సచివాలయం సమీపంలో వృద్ధులకు, వికలాంగులకు పెన్షన్లు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనివిధంగా ఎపిలో అధిక శాతంలో పెన్షన్లు ఇస్తున్నామని వైసిపి హయాంలో మాదిరిగా పెన్షన్ పెంపులో మోసం చేయలేదన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటకు కట్టుబడి అధికారంలోకొచ్చిన వెంటనే పెన్షన్ పెంపు చేసి ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలాధ్యక్షుడు షేక్ వలీ, బిజెపి కార్యదర్శి కాకి సురేష్‌కుమార్, సర్పంచి అనూష భాగ్యరాజ్, సర్పంచి పసుమర్తి పార్థసారథి బాబు, గూడపాటి కేశవరావు, గోరింక దాసు, వేముల నాగేశ్వరరావు, తూతా బాలాజీకుమార్, సొసైటీ మాజీ ఛైర్మన్ ఘంటా సత్యంబాబు, జుజ్జూరి బాబ్జి, వజీర్ ఖాన్, పుల్లం రాజు పాల్గొన్నారు.

పెదవేగి : పెదవేగి మండలంలోని కవ్వగుంట, వంగూరు, జగన్నాథపురం గ్రామాల్లో జరిగిన ఎన్‌టిఆర్ భరోసా ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పాల్గొన్నారు. వృద్ధాప్య, వైద్య, ఒంటరి మహిళ తదితర సామాజిక ఫించన్లను ఆయన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామ గ్రామాన అవ్వ తాతల మోములో ఆనందం వెల్లి విరిసిందన్నారు.

నూజివీడు టౌన్ : మండలంలోని మర్రిబందంలో ఉదయం ఏడు గంటలకే అవ్వ తాతలు, వికలాంగులు, వితంతువులు, తదితర ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి ఇంటింటికి వెళ్లి అందించారు. ముందుగా గ్రామ ప్రజలు, మహిళలు మంత్రికి ఘనస్వాగతం పలికారు. ప్రజలు ఆయన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల్లో కొన్నిటిని అక్కడికక్కడే పరిష్కరించారు. నూజివీడు మండలంలో పింఛన్లు, ఇళ్ల స్థలాల అవసరం ఉన్న లబ్ధిదారులను గుర్తించి మంజూరుకు అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సిఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒకే రోజున ఒకే సారి పెద్ద ఎత్తున రూ.నాలుగు వేల పింఛన్ల సొమ్ము పెంచి ప్రతినెలా ఇంటింటికి వెళ్లి నిరుపేద కుటుంబాలను కలుసుకుని వారి యోగక్షేమాలు, కుటుంబ ఆరోగ్య ఆర్థిక పరిస్థితులను అడిగి తెలుసుకుని పింఛన్ల సొమ్ము అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేకపోయినా కూటమి ప్రభుత్వాన్ని దీవించిన అన్ని తరగతుల ప్రజలకు మేలు చేయాలని ఉద్దేశంతోనే అభివృద్ధి, సంక్షేమ దిశగా రాష్ట్రానికి మంచి ప్రజాపాలన అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ, వివిధ శాఖల అధికారులు, గ్రామ సచివాలయ, వివిధ శాఖల ఉద్యోగులు, ప్రజా ప్రతినిధులు, టిడిపి మండలాధ్యక్షులు వాసు, గ్రామ నాయకులు రాము, కూటమి నాయకులు, లబ్ధిదారులు వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : పట్టణంలో జరిగిన ఎన్‌టిఆర్ పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. వైసిపి పాలనలో పెన్షన్లు తగ్గించగా ఇప్పుడు ఇంటిపెద్ద మరణిస్తే భార్యకు వెంటనే పింఛన్ అందేలా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధికి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం నారా లోకేష్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్లు నంబూరు రామచంద్రరాజు, చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కౌన్సిలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పోలవరం : మండలంలోని పాత పోలవరంలో శనివారం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. టిడిపి మండలాధ్యక్షులు మంగిన వెంకటరమణ (కొండ) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర ట్రైకర్ ఛైర్మన్, పోలవరం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొరగం శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పల్లె పల్లెల్లోని అర్హులైన పెన్షనుదారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమాన్ని వేగంగా, పారదర్శకంగా చేరవేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ మండలాధ్యక్షులు గుణపర్తి సత్యనారాయణ, కృష్ణారావుపేట సొసైటీ ప్రెసిడెంట్ కొణతాల ప్రసాద్, పట్టిసీమ సొసైటీ ప్రెసిడెంట్ నునకాని రాంబాబు, ఎస్ఎస్-ఎల్ మండల ప్రెసిడెంట్ ఎడ్ల వినోద్, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి ఆకుల రాజా, నాయకులు నల్ల రాంబాబు, శ్రీమన్నారాయణ, పట్టిసీమ పూడి సత్యనారాయణతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. సచివాలయ సిబ్బంది సమన్వయంతో పెన్షన్లు అందించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



నూజివీడులో...

ఏలూరు సిటీ : పేదల సంక్షేమమే లక్ష్యంగా విరామమెరుగక నిత్యం పరిశ్రమిస్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి స్పష్టం చేశారు. అర్హులందరికీ ప్రతినెలా ఒకటో తేదీనే పెన్షన్లను అందిస్తున్నామన్నారు. ఏలూరు రెండో డివిజన్‌లో డిసెంబర్ నెలకు సంబంధించిన ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లిన ఎంఎల్ఎ వారికి పెన్షన్ సొమ్ములను అందించారు. ఇదేసమయంలో కూటమి ప్రభుత్వ పనితీరుపై లబ్ధిదారుల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ఈ నెల 27 స్పౌజ్ పెన్షన్లు, ఐదు బెడ్ పేషెంట్ పెన్షన్లను కొత్తగా మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, కో-ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్ జున్నూరు కనక నరసింహారావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి అమరావతి అశోక్, డివిజన్ ఇన్‌ఛార్జి నాగులపల్లి గంగాధరరావు, కో-ఇన్‌ఛార్జి లంకలపల్లి సతీష్, తదితరులు పాల్గొన్నారు.



ముసునూరులో...

ముసునూరు : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీతో వితంతువులు, వృద్ధులు, వికలాంగులు ఆర్థికంగా వృద్ధి చెందుతున్నారని టిడిపి చిల్లబోయినపల్లి నాయకులు కస్తూరి అన్నారు. సోమవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గరికిముక్కు నాని, మానం ఘంటేశ్వరరావు, మెదరమెట్ల సురేంద్ర, మండలపు ధర్మరాజు, కొల్లి గంగారాం, కోల్లి కృష్ణయ్య, పొట్లూరి మహేంద్ర వర్మ, పొట్లూరి లక్ష్మీప్రసన్న, పొట్లూరి అనురాధ, పులి బళ్ల సత్యనారాయణ, గద్దల సుహాసిని మోహన్‌రావు, సూర్యదేవర శ్రీనివాసరావు, కొండేటి బాబి, దేవినేని ఢలరామ్, దేవినేని శ్రీధర్, గార్లపాటి నరసింహారావు, దేవినేని సాంబయ్య, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ద్వారకాతిరుమల గ్రామంలో గోపాలపురం వాణిజ్య విభాగం అధ్యక్షులు పెన్షన్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి మట్టపర్తి రూపేష్‌కుమార్, పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు గువ్వల మావుళ్లరావు, జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కోట అంజిబాబు, బిజెపి గ్రామ అధ్యక్షులు మెట్టపల్లి మాణిక్యాలరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు చెప్పారు. మండలంలోని బర్రింకలపాడు గ్రామంలో పలువురికి ఆయన ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను అందించారు. అదే విధంగా మండల వ్యాప్తంగా 4,218 పింఛన్లకు 3,968 పింఛన్లను సచివాలయ సిబ్బందితో పంపిణీ చేసినట్లు ఎంపిడిఒ నిఖిల్ మధుశరణ్ తెలిపారు. పలు పంచాయతీల్లో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు పాల్గొన్నారు. మండల వ్యాప్తంగా తొలిరోజు 94.07 శాతం పూర్తైనట్లు తెలిపారు.

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు సహకరించాలి

భీమడోలు సిహెచ్‌సి పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత

ప్రజాశక్తి - భీమడోలు

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు ప్రతిఒక్కరూ తమ వంతు సహాయ సహకారాలు అందించాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. భీమడోలు ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని భీమడోలు ఐసిటిసి కౌన్సిలర్, సింహాద్రి ఆధ్వర్యంలో నిర్వహించిన కొన్ని కార్యక్రమాలకు డాక్టర్ సునీత ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భీమడోలు శ్రీ వెంకటేశ్వర కళాశాల, శ్రీ మాధురి కళాశాల ఇతర విద్యాసంస్థల విద్యార్థుల భాగస్వామ్యంతో నిర్వహించిన ర్యాలీని డాక్టర్ సునీత ప్రారంభించారు. ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు ప్లకార్డులు ధరించి నినాదాలు చేస్తూ పురవీధుల్లో ర్యాలీని కొనసాగించారు. ర్యాలీని ప్రారంభించిన డాక్టర్ సునీత మాట్లాడుతూ హెచ్ఐవి నియంత్రణలో రాష్ట్రం దేశస్థాయిలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. గత పదేళ్ల కాలంగా ఎయిడ్స్ బాధితుల శాతం 2.34 నుంచి 0.58కి తగ్గిందన్నారు. చికిత్స పొందుతూ మరణించిన వారి సంఖ్య గణనీయంగా తగ్గిందని తెలిపారు. గర్భిణుల్లో ఎయిడ్స్ సంక్రమణ శాతం 0.04గా నమోదైందన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం పింఛన్లు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ప్రదీప్, సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

భీమడోలులో...

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ ఎయిడ్స్ డే ర్యాలీని నిర్వహించారు. ర్యాలీని ప్రారంభించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ ప్రస్తుతం ఎయిడ్స్ వ్యాధి అదుపులో ఉందని, అంతమాత్రాన అలసత్వం ప్రదర్శించవద్దని, అందరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం విద్యార్థులు, అధ్యాపకులు ర్యాలీగా వెళ్లి నినాదాలతో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యశాఖ నిర్వహించిన వక్తృత్వ పోటీలో ప్రథమ బహుమతి సాధించిన బికాం విద్యార్థి అబ్దుల్ మతీన్‌ను ప్రిన్సిపల్ అభినందించారు. ర్యాలీలో వైస్ ప్రిన్సిపల్ కె.అజయ్‌కుమార్, రెడ్ రిబ్బన్ క్లబ్ కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎం.విజయకుమార్, అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.రాంబాబు, టివిఎస్.పద్మావతి పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో అంతర్జాతీయ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి పెద్ద కాసిం మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులకు దూరంగా ఉండాల్సిన అవసరం లేదన్నారు. ఎయిడ్స్ సంక్రమిస్తే తప్పనిసరిగా ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకుని వైద్యుల సూచన మేరకు మందుల వినియోగంతో నివారించుకోవచ్చన్నారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా రత్నాజీ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

గోపాలపురం నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షులుగా ఇమ్మడి వెంకటరత్నం (రత్నాజీ) నియమితులయ్యారు. ఈ సందర్భంగా టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రూపేష్ కుమార్ (బద్రి), టిడిపి గ్రామ ఉపాధ్యక్షులు, గువ్వల మావుళ్లరావు, పార్టీ గ్రామ ప్రధాన కార్యదర్శి అందుగుల రాములు, జనసేన ద్వారకాతిరుమల పట్టణ అధ్యక్షులు అంజిబాబు, బిజెపి పట్టణ అధ్యక్షుడు మెట్టపల్లి మాణిక్యాలరావు, గోరంట్ల చంద్రశేఖర్, కూటమి సభ్యులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

వెంకట మహాలక్ష్మికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండల కేంద్రమైన టి.నరసాపురం గ్రామానికి చెందిన గృహిణి మండం వెంకట మహాలక్ష్మి భగవద్గీత కంఠస్థ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించినట్లు ఆమె భర్త ఎంఆర్ఎన్ఎస్ పి.సత్యనారాయణమూర్తి తెలిపారు. టి.నరసాపురం గ్రామానికి చెందిన వెంకటమహాలక్ష్మి గత ఏడాదిగా భగవద్గీతను నిత్యం పారాయణం చేస్తున్నారని, ఈ క్రమంలో కర్ణాటక రాష్ట్రం మైసూరు అవధూత దత్త పీఠం ఆధ్వర్యంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారని, ఈ పోటీల్లో పాల్గొన్న మహాలక్ష్మి భగవద్గీతను అలవోకగా ఉచ్చరిస్తూ ఉత్తమ ప్రతిభ చూపారని తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో విజేతగా నిలిచి గోల్డ్‌మెడల్ సాధించారని, సోమవారం గీతా జయంతి సందర్భంగా మైసూరు ఆశ్రమంలో శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతులమీదుగా గోల్డ్‌మెడల్‌ను, సర్టిఫికెట్‌ను అందుకున్నారని వివరించారు. ఈ సందర్భంగా గోల్డ్ మెడల్ గ్రహీత మహాలక్ష్మి మాట్లాడుతూ భగవద్గీతను సరిగ్గా అర్థం చేసుకుని, ఆచరణలో పెట్టగలిగితే మానసిక, శారీరక ప్రశాంతత లభిస్తుందన్నారు. భగవద్గీత కంఠస్థ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించడం పట్ల టి.నరసాపురం గ్రామపెద్దలు, ప్రముఖులు మహాలక్ష్మిని అభినందించారు.

బ్లైండ్ క్రికెటర్ కరుణకుమారికి రవినాయుడు సత్కారం

ప్రజాశక్తి - పోలవరం

అంతర్జాతీయ స్థాయిలో కేరింతలు కొడుతున్న వికలాంగ క్రికెట్ రంగంలో రాష్ట్ర ప్రతిష్టను ఎత్తిన బ్లైండ్ క్రికెటర్ కరుణకుమారి సోమవారం ఆంధ్రప్రదేశ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆమెకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ఘన స్వాగతం పలికారు. విజయవాడలోని ఎపి స్పోర్ట్స్ అథారిటీ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ రవినాయుడు స్వయంగా హాజరై కరుణకుమారిని సత్కరించారు. వికలాంగతను అధిగమించి క్రీడారంగంలో సాధించిన విజయాలు అందరికీ ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపి స్పోర్ట్స్ అథారిటీ డైరెక్టర్లు కొవ్వాసు జగదీశ్వరి, సంతోష్‌కుమార్ పాల్గొని కరుణకుమారిపై అభినందనలు కురిపించారు. క్రీడలకు ప్రభుత్వం అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తుందని, ముఖ్యంగా వికలాంగ క్రీడాకారుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కరుణకుమారి సాధించిన ప్రతిష్ట రాష్ట్ర యువతకు స్ఫూర్తిదాయకమని, క్రీడాదక్షతతో పాటు పట్టుదల ఉంటే ఏ అవరోధాన్ని అయినా అధిగమించగలమని సందేశం ఇచ్చిందని ప్రసంగకర్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్రీడా సంఘాల ప్రతినిధులు, అధికారులు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



కరుణ కుమారిని సత్కరిస్తున్న రవినాయుడు

పామాయిల్ కార్మికులకు గుర్తింపు కార్డులివ్వాలి

పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పామాయిల్ కార్మికులకు ప్రభుత్వం కార్మికులుగా గుర్తింపు కార్డులు ఇవ్వాలని పామాయిల్ కార్మిక సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ డిమాండ్ చేశారు. పెదవేగి మండలం రామసింగవరం గ్రామంలో సోమవారం పామాయిల్ తోటలో గెలలు కోస్తున్న దిమ్మిటి చిన్న రాటయ్య విద్యుదాఘాతంతో చనిపోయిన నేపథ్యంలో రామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో పదివేల మందికి పైగా పామాయిల్ కార్మికులు పామాయిల్ తోటలో పని చేస్తున్నారని, తోటల్లో పనిచేస్తున్న సందర్భంలో పామాయిల్ గెలలు కోయడం, లోడ్ చేయడం, ఫ్యాక్టరీల వద్ద అన్‌లోడ్ చేయటం వంటి పనులు చేస్తున్న కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఈ కాలంలో విద్యుత్ షాక్ తగిలి, విష పురుగులు కాటేసి అనేకమంది చనిపోతున్నారని, వికలాంగులుగా మారుతున్నారని చెప్పారు. ఏలూరు ఎంపీ పామాయిల్ రైతుల గురించి మాట్లాడుతున్నారే తప్ప పామాయిల్ తోటల్లో పనిచేస్తూ పొట్ట నింపుకునేందుకు కష్టపడుతున్న కార్మికుల గురించి మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. పని చేస్తేనే పూట గడిచే పేదల కుటుంబాలు పక్షాన మాట్లాడకపోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఇప్పటికైనా ఎంపీ పామాయిల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై జిల్లాలో ఉద్యాన శాఖ, విద్యుత్ శాఖ, కార్మిక శాఖ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించుకున్నా పెడచెవిన పెట్టారని దుయ్యబట్టారు. పామాయిల్ కార్మికులకు కార్మిక శాఖ ద్వారా గుర్తింపు కార్డులు ఇచ్చి వారిని ప్రభుత్వమే కార్మికులుగా గుర్తించాలని కోరారు. చనిపోయిన కార్మికుని కుటుంబానికి నష్టపరహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వాలు విడనాడాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షుడు టివిఎస్.రాజు అన్నారు. మండలంలోని మక్కినవారిగూడెంలో సోమవారం ముఠా వర్కర్ యూనియన్ సర్వసభ్య సమావేశం అధ్యక్షులు కాళహస్తి సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టివిఎస్.రాజు మాట్లాడుతూ కనీస వేతనాల్లో కోతలు, ఎనిమిది గంటల పని విధానాన్ని రద్దు చేసి 12 గంటల పని విధానాన్ని అమలు చేయడం కోసం ఎన్‌డిఎ ప్రభుత్వం చేస్తున్న కుట్రలను ఆయన తీవ్రంగా ఖండించారు. దేశంలో బడా పరిశ్రమలన్నీ అంబానీ, ఆదానీ వంటి కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని చూస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలపై కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న సిఎం చంద్రబాబు ఖండించాలని ఆయన డిమాండ్ చేశారు. సాధించుకున్న హక్కులను కాపాడటం కోసం కార్మికులంతా సమైక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ ఉపాధ్యక్షుడు మల్లెల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ముసునూరి కృష్ణారావు, సహాయ కార్యదర్శి వీరంకి శ్రీను, కోశాధికారి కొండముచ్చు శ్రీనివాసరావు, కార్యవర్గ సభ్యులు దొడ్డకుల రాము, బైగాని ఏకాంబరం తదితరులు పాల్గొన్నారు.

40 మందికి కంటి వైద్య పరీక్షలు

కామవరపుకోట : నిడదవోలు జాగృతి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మండలంలోని పాతూరులో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. రామాలయం వద్ద డాక్టర్ లోకేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిబిరంలో గ్రామానికి చెందిన 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో కొందరికి కంటి, చూపు లోపాలు ఉన్నట్లు గుర్తించారు. 12 మందికి కళ్లజోళ్లు వేశారు. ఒకరికి శస్త్రచికిత్స అవసరం ఉందని గుర్తించారు. మిగిలిన వారికి ఉచితంగా మందులు అందించారు.

CHANGE OF NAME

I, SHAIK MEER NABIUNNISA SULTHANABEGUM (Old Name) D/o SHAIK AKBAR BASHA R/o Door no 14-5-9, pension line, Near A R D G K school, Eluru, Andhra Pradesh, 534005 have changed my name to MOHAMMED NABIUNNISA (New Name). Hence forth I am being called as MOHAMMED NABIUNNISA for all purposes. By mohammed nabiunnisa

పాస్‌పోర్టు పోయినది

పచ్చిమ గోదావరి జిల్లా గణపవరం మండలం గణపవరం గ్రామ కాపురస్తులైన పెరుమాళ్ళ దివ్య శ్రీ సాయి లలిత తండ్రి శ్రీనివాస్ అను నేను నా యొక్క పాస్ పోర్ట్ నెంబర్ V1058231 గల్ల పాస్ పోర్ట్ గణపవరం గ్రామంలో జిరాక్స్ తీయించు కుని మా ఇంటికి గణపవరం వెళ్ళే మార్గ మధ్యలో ఒరిజినల్ పాస్ పోర్ట్ మరియు జిరాక్స్‌తో సహా కవర్లో పెట్టుకుని బండికి తగిలించి వెళ్లే మార్గ మధ్యలో ఎక్కడ పడిపోయిందో తెలియదు ఎంత వెతికిన దొరిక లేదు దొరికినవారు ఈ కింది నెంబర్‌కు తెలియజేయగలరు.

పెరుమాళ్ళ దివ్య శ్రీ సాయి లలిత, తండ్రి శ్రీనివాస్, గణపవరం గ్రామం, గణపవరం మండలం, పశ్చిమగోదావరి జిల్లా. సెల్.9494705577

మహారాజశ్రీ విజయవాడ 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి

OS No.1075/2024

Between:-
Bank of Baroda Gollapudi Branch, Vijayawada, Rep by it's Chief Manager
...Plaintiff

And

1) Panuganti Rajya Lakshmi W/o Ramesh, R/o. D.No.7-321/18, Road No.2, Krishna Vilas Colony, Nuzvid, Nuzvid Mandal, Krishna District-521201
2) Panuganti Ramesh, S/o Sambasiva Rao, R/o. D.No.7-321/18, Road No.2, Krishna Vilas Colony, Nuzvid, Nuzvid Mandal, Krishna District-521201.
..Defendants

పై నంబరు దావా వాది బ్యాంకువారు, మీపై దావా బాకీ రు 1,71,100-00ల్కు మరియు ఖర్చులు వగైరాలు రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు యెట్టి అభ్యంతరములు ఉన్న యెడల తెలుపకొనే నిమిత్తము ది.11-12-2025వ తేదిన ఉదయం 10-30 గం॥లకు మీరు స్వయముగా గాని, లేక న్యాయవాది గారి ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలుపుకొవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలిజేయడమైనది.

విజయవాడ
28-11-2025

ఇట్లు
దాసు త్రివిక్రమవ్యాస్,
వాది బ్యాంకు తరపు న్యాయవాది,
స్వామి స్ట్రీట్, గాంధి నగరం, విజయవాడ-520003,
సెల్ నెం.62814 51118

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL JUNIOR CIVIL JUDGE (SPECIAL MOBILE COURT) AT VIZIANAGARAM
O.S. 715/2023

Between:
Valle Sankara Rao and another...Plaintiffs
And:
Valle Pydisetty and others ...Defendants
To
D-5 : Smt. Sunkari Rama Venkata Naga Devi Prasanthi, W/o Santosh Kumar, aged 36 years, Residing at D. No. 29-18, Guntiswari Street, Palakollu, West Godavari District.

NOTICE

Take notice that the plaintiffs filed the above suit under against the defendants for partition of the suit schedule properties which you are the 5th defendant and the said suit stands posted to 17-12-2025 for notice to you. If you got any objection in the above suit you can appear in person or through an advocate and file your objections if any on **17-12-2025 at 10-30 A.M** in the above Court. If failed to appear the honorable court will decide the matter as exparte.

L. SATYANARAYANA,
Advocate for the plaintiffs
VIZIANAGARAM-535002